క్లుప్తంగా

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



దుగ్గొండి : మండల కేంద్రంలో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ అజీమ్ పాషాను డీఈ సదానందం శాలువా, పూలమాలలతో శుక్రవారం సత్కరించారు. అనంతరం సదానందం మాట్లాడారు మూడు దశాబ్దాలపాటు విధులు నిర్వర్తించిన విద్యుత్ శాఖ ఉద్యోగులను సన్మానించేలా ట్రాన్స్‌కో ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అజీమ్ పాషా 30 ఏళ్లపాటు విధులు నిర్వర్తించారని చెప్పారు. మండలంలో గతంలో లైన్‌మెన్‌గా పని చేసి ఉద్యోగోన్నతిపై ఇక్కడికే లైన్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మన్, ఏఈ సురేశ్‌కుమార్, విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



ఖానాపురం : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ సాయిచరణ్ చెప్పారు. మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించాలని చెప్పారు. గ్రామాల్లో నూతన నర్సరీలను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ సుమణవాణి, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు



నెక్కొండ : జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దని ప్రజలను డాక్టర్ అరుణ్‌కుమార్ కోరారు. మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని వెంకటతండాలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 40 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. జ్వరాల బారిన పడితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ సుధ, సూపర్‌వైజర్ రాజు, గ్రామ కార్యదర్శి శైలజ, సిబ్బంది కరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

వర్ధన్నపేట : గ్రామాల్లో ఉల్లిగడ్డలను విక్రయించడానికి వెళ్తున్న ఆటోను మండలంలోని ఇల్లంద శివారులో కేసముద్రం నుంచి లోడుతో వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ అప్రమత్తమై ఆటో నుంచి బయట దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఆటో నుజ్జునుజ్జయ్యింది.

కారుకు బైక్..

మండలంలోని ఇల్లంద గ్రామంలో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన కారును ఐనవోలు మండలంలోని పెరుమాండ్లగూడెం గ్రామానికి చెందిన యువకుడు బైక్‌పై వచ్చి ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. కారు సమీపంలో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది.

ఎస్సారెస్పీ కాల్వలో మహిళ మృతదేహం

వర్ధన్నపేట : వర్ధన్నపేట శివారు కొత్తపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలోకి శుక్రవారం కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మహిళ మృతదేహం గల్లంతైంది. కొందరు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు కాల్వ వద్దకు చేరుకుని మృతదేహాన్ని తీసే ప్రయత్నం చేశారు. కాగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. మహిళ గులాబీ రంగు చీర, నలుపు రంగు జాకెట్ ధరించి ఉంది. మృతదేహం మైలారం రిజర్వాయర్‌లోకి కొట్టుకుపోయి ఉంటుందని భావిస్తున్నారు.

చిన్నారుల సంఖ్య పెంచాలి

కాయంపేట : మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్ చిన్నారుల సంఖ్యను పెంచాలని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం అంగన్‌వాడీ కేంద్రంలో పత్తిపాక సెక్టార్‌కు సంబంధించిన ఆయాలకు శుక్రవారం ఆమె పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సెంటర్ తెరిచి ఉంచాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, టీచర్లు పద్మజ, శ్రీలత, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ



నర్సంపేట : మాంటిస్సోరి హైస్కూల్‌లో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, చిన్నారులు



వర్ధన్నపేట : కళాశాలలో..



సంగెం : విద్యాభారతి హైస్కూల్‌లో..

నర్సంపేట : పట్టణంలోని విజ్‌డమ్, మాంటిస్సోరి, మదర్‌ల్యాండ్ హైస్కూళ్లతోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆట పాటలతో అలరించారు. విజ్‌డమ్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న పాల్గొని ఉత్సాహం నింపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మలతో ఆటలాడుతూ సందడి చేశారు. కార్యక్రమాల్లో మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఎర్ర ఊర్మిళాదేవి, ప్రిన్సిపాల్ కడియం శ్రీనివాసులు, మదర్స్ ల్యాండ్ హైస్కూల్ చైర్మన్ పాశికంటి రమేశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని భారతి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల చైర్మన్ జన్నపురెడ్డి అశోక్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకాచారి, అధ్యాపకులు అనిల్‌కుమార్, గుంశావలీ, ధనలక్ష్మి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆట పాటలతో హోరెత్తించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డెమ్మకు భక్తిశ్రద్ధలతో వీడ్కోలు



రాయపర్తి : వెంకటేశ్వరపల్లిలో బొడ్డెమ్మకు వీడ్కోలు పలుకుతున్న మహిళలు



నల్లబెల్లిలో..

రాయపర్తి : తొమ్మిది రోజులపాటు పూజించిన మహిళలు చివరి రోజు సందర్భంగా శుక్రవారం బొడ్డెమ్మకు భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. మండలంలోని తిర్మలాయపల్లి, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో బొడ్డెమ్మకు భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమాల్లో నందనబోయిన మానస, జమున, దివ్య, బండి ఐశ్వర్య, దోకుడు స్వీటి, పాడిశెట్టి సౌమ్య, గజవెల్లి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలో బొడ్డెమ్మ పండుగను మహిళలు నిర్వహించారు. బొడ్డెమ్మను చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పోలింగ్ బూత్‌లో పరిశీలన



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భారతి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. పాఠశాల మైదానం అపరిశుభ్రంగా ఉండటంతో శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వామి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

‘కేంద్ర’ నిధులతోనే రాష్ట్రంలో పురోగతి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి



గీసుకొండ : మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

గీసుకొండ : కేంద్రంలోని బీజేపీ కేటాయించిన నిధులతోనే రాష్ట్రంలో పురోగతి సాధించినట్లు ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆరెపల్లిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు శంకర్‌రావు సోదరుడు కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని విజయ్‌చందర్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ జాన్ విక్రం, మండల ఇన్‌చార్జ్ మొలుగూరి శ్రీనివాస్, నాయకులు బుట్టి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని కొండూరు, కొలన్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలని వినతి



నర్సంపేట : పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీలో అవినీతిపై విచారణ చేపట్టాలని కోరుతూ ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి, అధ్యక్షుడు గట్టి కృష్ణ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి, కృష్ణ మాట్లాడారు. ఈ ఏడాది జనవరిలో అకాల వర్షాలతో నర్సంపేట డివిజన్‌లోని వివిధ మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి పంటలు దెబ్బతినగా ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అర్హులకు అందలేదని చెప్పారు. ఇకనైనా వెంటనే బాధిత రైతులందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, మల్లన్న, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

నర్సంపేట : ప్రజాస్వామ్య పరిరక్షణే ఎంసీపీఐ(యూ) ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఎల్లబోయిన రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయ సాధన కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. అనేక ఆశలు, ఆశయాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో పాలకులు మోసపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో నర్సంపేట, పరకాల, వరంగల్ తూర్పు అభ్యర్థులు పెద్దారపు రమేష్, గోనె కుమారస్వామి, సుంచు జగదీశ్వర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, మహ్మద్ రాజాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సింగతి మల్లికార్జున్, సదానందం, నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ గెలుపే లక్ష్యం’



వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే తమ లక్ష్యమని వడ్డెర సంఘం డివిజన్ నాయకులు భాస్కర్, రంగనాథ్, మల్లయ్య, మహేశ్, రవి తెలిపారు. ఆ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజును హనుమకొండలోని నివాసంలో వడ్డెర సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు. అనంతరం నాయకులు భాస్కర్, రంగనాథ్, మల్లయ్య, మహేశ్, రవి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తామని తెలిపారు.

అంబేడ్కర్ యువజన సంఘం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

గీసుకొండ : ఎన్నికల కోడ్ పేరుతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని ధర్మారం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ముసుగు వేయడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. ముసుగు వేయడంపై ప్రశ్నించగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్రం శ్రీనివాస్ దురుసుగా మాట్లాడారని సంఘం నాయకులు మండిపడ్డారు. సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని, జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోగా ఎస్సై వెంకన్న సిబ్బందితో వచ్చి ఆందోళన విరమింపజేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ముసుగు తొలగించి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దుపాకి సంతోశ్‌కుమార్, భరద్వాజ్, సాయి, నరేందర్, ఎలగొండ ప్రవీణ్, జన్ను రాజు, బొల్లం రాంకుమార్, గాదె ప్రమోద్, ప్రవీణ్, గనిపాక భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామెర: నేడు (శనివారం) నేడు (శనివారం) దామెర, ఊరుగొండ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల్లో భాగంగాఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చైతన్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న రాజు

సంగెం : చైతన్యంతోనే హక్కులను సాధించుకోగలమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు తెలిపారు. మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర మండలంలోని కాపులకనిపర్తికి శుక్రవారం చేరుకోగా ఆయన మాట్లాడారు. ఎస్సీ కులాల్లోని 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో సమాన వాటా కోసం 29 ఏళ్లుగా మంద కృష్ణ పోరాడుతున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ తొమ్మిదేళ్లపాటు మోసపూరితంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. రానున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి జన్ను మధుకర్, ఉపాధ్యక్షుడు ఇస్సంపల్లి రాజు, యువసేన జిల్లా మాజీ అధ్యక్షుడు చాతల్ల రమేశ్, ఇనుముల పూర్ణయ్య, నమిండ్ల సుమన్, రామారావు, సమ్మయ్య, వెంకటేశ్, రాజు, వినయ్, ప్రణీత్, శశి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుతామంటూ ప్రతిజ్ఞ



గీసుకొండ : అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని కాపాడతామంటూ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామంగా గుర్తింపు పొందిన మరియపురంలో మహిళలు శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. ‘చేయిచేయి కలుపుదాం.. ప్రకృతిని కాపాడుదాం’ అంటూ నినదించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



రాయపర్తి: కాంగ్రెస్‌లో చేరుతున్న శోభసోమిరెడ్డి



నర్సంపేట : పార్టీలో చేరిన వారితో మాధవరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఐసీసీ సభ్యుడు, స్థానిక మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఖానాపురం మండలంలోని గొల్లగూడెంతండా, కోమటిపల్లితండాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 11 కుటుంబాలు మాధవరెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా వారికి మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తుందని, మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీటీసీ మూడు పూల్‌సింగ్ పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గుగులోత్ ఆనంద్, జమలాపురం సుధాకర్, వాంకుడోత్ రాజు, కూచన విజయ్, తదితరులను మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వెంగలదాస్ రమేశ్, అర్షం యాకయ్య, సిద్దూరి తిరుపతిరావు, ఎర్రబెల్లి రఘుపతిరావు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని పెద్దకోర్పోలు, వెంకట్‌తండా నుంచి పలువురు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన పెద్దకోర్పోలు మాజీ సర్పంచ్ మెండె పద్మ కుమారస్వామి, గైని సతీశ్, వెంకట్‌తండా ఉపసర్పంచ్ ధరావత్‌రవి, వార్డు సభ్యుడు ధారావత్ సురేశ్, మాలు, తదితరులకు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు గైని లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డి సమక్షంలో..

రాయపర్తి : మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన కొలన్‌పల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ కొసన శోభ సోమిరెడ్డి దంపతులు పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

‘ఆరు గ్యారంటీ’ల అమలు ఖాయం



నల్లబెల్లి : ప్రచారం చేస్తున్న నాయకులు



పర్వతగిరిలో..

నర్సంపేట : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం ఖాయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ స్పష్టం చేశారు. పట్టణంలోని 13, 14 డివిజన్లలో ‘గడప గడపకు కాంగ్రెస్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, 13వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీరామోజు మురళి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అజ్మీర తిరుపతి మాట్లాడారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మామిండ్ల రాజిరెడ్డి, చిట్యాల ఉపేందర్ రెడ్డి, నాయకులు బేతి భరత్, గాదె కరుణాకర్, గాదె మహిపాల్, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూసం రాంచందర్, జమలాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు జన్ను కనకయ్య, ఉపసర్పంచ్ గోదావరి శ్రీనివాస్, ఎంపీటీసీ లావుడ్య సరోజన లచ్చు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుడికి ఆత్మీయ సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న యాకాంబ్రం

రాయపర్తి : 18 ఏళ్లు సైనికుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత సైనికుడికి బాల్యస్నేహితులు, మిత్రులు, కుటుంబీకులు స్వగ్రామంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. మండలంలోని మైదారం గ్రామానికి చెందిన మామిడాల యాకాంబ్రం 2001–02 విద్యాసంవత్సరంలో స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి అభ్యసించాడు. అనంతరం 2006లో సైనికుడిగా ఉద్యోగం పొంది దేశ సరిహద్దులో విధి నిర్వహణకు వెళ్లాడు. నాటి నుంచి సైన్యంలో విధులు నిర్వర్తించాడు. అనంతరం తాజాగా ఉద్యోగ విరమణ పొంది శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా యాకాంబ్రం చిన్ననాటి స్నేహితులు, మిత్రులు, బంధువులు ఘనస్వాగతం పలికి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. యాకాంబ్రంతో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం యాకాంబ్రం మాట్లాడారు. సైనికుడిగా విధులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, రాజేందర్, వెంకన్న, ఎల్లయ్య, సునీల్‌కుమార్, కోటేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

నెక్కొండ : మానవ (బాలల) అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ బెజ్జంకి ప్రభాకర్ కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని ఆటో అడ్డా వద్ద ‘మానవ (అక్రమ) రవాణాను అరికడదాం’ కార్యక్రమ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. మానవ అక్రమ రవాణాను ఘోరమైన నేరంగా అభివర్ణించారు. అక్రమ రవాణాకు పాల్పడితే నిందితులకు జీవిత ఖైదు తప్పదని చెప్పారు. అపరిచితుల మోసపూరిత మాటల పట్ల మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్–1098 నంబర్‌కు ఇవ్వాలని చెప్పారు. మానవ అక్రమ రవాణా నివారణలో డ్రైవర్లు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు సదయ్య, గిరి, రాజేందర్, కార్తీక్, రాజు, నర్సింహ, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామెర: మండలంలోని కోగిల్వాయి పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసిన వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి జయపాల్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడిగా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ పత్రికా సంపాదకుడు ఇన్నారెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, రాష్ట్ర నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సింగరావు, భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శరత్ కుమార్ పాల్గొన్నారు.